## ౨౧

# ఇలా ఇంకా ఎంతమందో?

అక్కడ చాలామంది గుమికూడారు. ప్రక్కనే బావి ఒకటి ఉంది. వాళ్ళు మూగింది బావిచుట్టూ కాదు. అందులోంచి తీయబడిన రెండు శవాలచుట్టు ఒకటి స్త్రీది. ఇంకోటి పురుషుడిది. ఇద్దరూ వయసులో ఉన్నవాళ్ళే! అందరి చూపుల్లో జాలి కదలాడుతూంది. ఆ శవాలు నీళ్ళలో నాని ఉబ్బిపోయి ఉన్నాయి. పెద్దవాళ్ళు పిల్లలు చూస్తే జడుసుకుంటారని వాళ్ళను వెనక్కు లాగేస్తున్నారు. కొందరు అక్కడివాళ్ళు మాట్లాడే మాటల్ని వింటూ నూతిలోనికి తొంగిచూస్తున్నారు.

అక్కడ ఉన్న వాళ్ళందరూ వాళ్ళిద్దరి అమరప్రేమను ప్రశంసిస్తున్నారు.

"ప్రేమికులంటే ఇలా ఉండాలి. కలిసి జీవించాలి. కలిసి మరణించాలి... అదీ నిజమైన ప్రేమంటే..."

"పాపం!... వీళ్ల ప్రేమను ఇంట్లో పెద్దవాళ్లు ఒప్పుకోలేదేమో?..."

"ఒకరికొకరు అంతగా కోరుకుంటున్నప్పుడు ఇద్దరూ హాయిగా పెళ్లిచేసుకోక ఇలా ఆత్మహత్య చేసుకోవడం ఏమిటి!..."

వాళ్లకేం యిబ్బందులున్నాయో?"

"అసలు ఈ పెద్దవాళ్ళననాలి... రెండు నిండు ప్రాణాలు వాళ్ళ మూఢాచారాలకు బలితీసుకున్నారు."

ఎవరో కుర్రవాడు ఆవేశంగా అంటున్నాడు.

"అసలు వీళ్ళ తల్లిదండ్రులు ఎందుకు ఒప్పుకోలేదో మరి"

"ఇద్దరూ ఒక కులం కాదేమోనండీ"

"కులం...కులం...కులం...పవిత్రమైన ప్రేమను నాశనంచేసే ఈ కులమత భేదభావాలను పట్టుకొని ఇంకా గబ్బిలాల్లా వ్రేలాడుతున్నారు మతిలేని మన భారతీయులు. హుఁ...కులం అట !... కులం !...

ఇందాకటి కుర్రాడే ఆవేశంతో చిందులు వేశాడు.

"కులాంతర వివాహం చేసుకుంటే కలిగే కష్టనష్టాల గురించి వేడి రక్తంగల ఈ యువతీ యువకులు ఆలోచిస్తారా?... పిల్లకాకికేం తెలుసు ఉండేలు దెబ్బ??"

ఎవరో సనాతనుడు అంటున్నాడు.

"చచ్చి ఏం సాధించుదామనో ?"

"బ్రతికున్నప్పుడు వాళ్లను ఎవరేం సాధించారో !"

"పాపం... వాళ్ళ ప్రేమకు పర్యవసానం ఇలా ఉంటుందని ఎన్నడైనా ఊహించి ఉంటారా ?"

"నిజమైన ప్రేమికులంటే వీళ్లే"

ఇలా చర్చించుకుంటున్నారు అక్కడివాళ్ళు. పోలీసులు

వాళ్ళు ఎక్కడివాళ్ళో ఎవరితాలూకు వాళ్ళో తెలుసుకోడానికి ప్రయత్నిస్తున్నారు.

అక్కడ గదిబయట సుమారు ఇరవైమంది వరకూ కూర్చుని ఎదురుచూస్తున్నారు. ప్యూను ఒక్కొక్కళ్లనే పిలిచి ఆ గదిలోనికి పంపుతున్నాడు. అందరూ ఆతృతగా తమ వంతు కోసం ఎదురుచూస్తున్నారు. వాళ్లలో నారాయణకూడా ఉన్నాడు.

అక్కడ క్లర్కు ఉద్యోగానికి ఇంటర్వ్యూ జరుగుతుంది. ఒక్కటే ఖాళీ—దానికి ఇరవైమందిని ఇంటర్వ్యూకని పిలిచారు. ఇంటర్వ్యూ ఫలితం అందరితో ఇంటర్వ్యూ అయిన తరువాత అప్పుడే చెప్పేస్తారు. అందుచేత ఇంటర్వ్యూ అయిపోయిన వాళ్ళు కూడా వెళ్ళిపోకుండా అక్కడే ఒకమూల కూర్చుని ఆత్రంగా ఫలితం గురించి ఎదురుచూస్తున్నారు.

అక్కడివాళ్ల మాటలు నారాయణని నిరుత్సాహ పరిచాయి. రికమండేషను ఉన్న వాళ్లకే ఆ ఉద్యోగం వస్తుందని వాళ్ళు అభిప్రాయపడుతున్నారు. అయినా నారాయణలో ఆశ ఎక్కడో మిణుకు మిణుకు మంటుంది.

నారాయణవంతు వచ్చింది ప్యూను పిలిచాడు. నారాయణ వణికే అడుగులతో బరువైన గుండెతో గదివైపు అడుగులు వేశాడు.

ఇంటర్వ్యూలో ఆఫీసరు అడ్డమైన ప్రశ్నలూ వేశాడు. ఫలానా వాడు ఎప్పుడుపుట్టాడు, ఫలానా వాడు ఎప్పుడుచచ్చాడు,

భారతదేశంలో పొడవైన వంతెనేది? వెడల్పైన కాలవేది? ఇరుకైన సందేది? ఇలా రకరకాల ప్రశ్నలు వేశాడు. అన్నిటికీ నారాయణ ఓపికగా సమాధానం ఇచ్చాడు. సమాధానాలైతే ఇచ్చాడుగానీ తను చేయబోయే గుమాస్తా ఉద్యోగానికి ఆయనడిగిన ప్రశ్నలకీ ఉన్న సంబంధం ఏమిటో అర్థం కాలేదు. ఏది ఏమైనా నారాయణ ఇంటర్వ్యూ బాగానే చేశాడు.

ఇంటర్వ్యూ అయిన తరువాత బయట ఫలితంకోసం కూర్చున్నాడు నారాయణ. అందరి ఇంటర్వ్యూలు అయిన తరువాత ఆ ఆఫీసులోనే పనిచేస్తున్న ఒక గుమాస్తా వచ్చి ఫలితాన్ని ప్రకటించాడు. నారాయణకి ఉద్యోగం రాలేదు. మెట్రిక్యులేషన్ మాత్రమే పాసయిన ఒకబ్బాయికి ఆ ఉద్యోగం వచ్చింది. అతను తనకా ఉద్యోగం వస్తుందని ఎప్పటినుండో తెలుసునన్నట్లు ఫోజుకొట్టి పెదవి విరిచి చిరునవ్వు అందరివైపు విసిరి వెళ్ళిపోయాడు.

గ్రాడ్యుయేట్ నారాయణ కాళ్లీడ్చుకుంటూ నెమ్మదిగా ఆఫీసునుంచి బయటపడ్డాడు. అతని ముఖం పాలిపోయింది. కళ్లలో ఒక విధమైన విరక్తిభావం కదులుతూంది.

హోటల్‌కి వెళ్లి వేడి వేడి కాఫీ త్రాగి పార్కువైపు దారితీశాడు నారాయణ.

రంగు రంగుల పూలమొక్కలతో పార్కు కళకళలాడుతుంది. అంతటి ఆహ్లాదాన్ని కలిగించే వాతావరణంకూడా నారాయణ మనసుకు ఊరట కలిగించలేదు. అతని మనసంతా అల్లకల్లోలంగా ఉంది. నిరాశా నిస్పృహలు అతన్ని నిలువెల్లా

క్రుంగదీస్తున్నాయి. నారాయణకు తన యింటి పరిస్థితులు ఒక్కొక్కటే గుర్తుకువచ్చి బాధపడుతున్నాడు. భవిష్యత్తు అంతా అంధకారంగా కనబడుతుందతనికి.

నారాయణ రెండు సంవత్సరాలనుంచీ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. కొన్ని వందల అప్లికేషన్లు పెట్టాడు కాళ్లరిగేలా తిరిగాడు. ఫలితం శూన్యం. ఉద్యోగం దొరకడం ఇంత కష్టమని అతను కలలోనైనా ఊహించలేదు.

నారాయణ అలా ఎంతసేపు కూర్చున్నాడో తెలియదు. ఆలోచనల కారాగారంనుంచి విముక్తుడై తనచుట్టూ ఆవరించి ఉన్న చీకటివైపు చూశాడు. పార్కులో అతనుతప్ప ఇంకెవ్వరూ లేరు. అతని ముఖం వివర్ణమైంది. పెదాలు వణుకుతున్నాయి. కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. ఏదో నిర్ణయానికి వచ్చినట్టుగా చటుక్కున లేచినిలుచుని తూలిపడబోయి నిలద్రొక్కుకుని ముందుకు అడుగులు వేశాడు.

*   *   *   *   *

సాయంత్రం ఐదు కావొస్తుంది. సుమతి ఇంటికి వెళ్ళడం కోసం ఫైళ్ళు ట్రేలో సర్ది పెట్టేస్తుంది. ఉదయం నుంచీ పనిచేయడం వల్ల ఆమె అలసిపోయింది. నొసట చెమటపట్టి ముంగురులు అంటుకుపోయాయి. అలసిపోయిన ఆమెముఖం మబ్బులమాటు చంద్రుడిలా ఉంది.

ఫైళ్ళన్నీ సర్ది పెట్టి గోడగడియారం వంక చూసింది. ఐదు కావడానికి ఇంకా పది నిముషాలుంది.

"అమ్మగారూ... మిమ్మల్ని పెద్దయ్యగారు పిలుస్తున్నారండి."

ప్యూను రంగన్న సుమతితో చెప్పి ఆమె ముఖంలోకి చూస్తూ నిలుచున్నాడు.

సుమతి ఒకసారినిట్టూర్చి లేచి ఆఫీసర్ గదివైపు అడుగులు వేసింది.

మునివేళ్ళతో తలుపు తట్టి

"మే ఐ కమిన్ సర్!" అని అడిగింది.

"ప్లీజ్... కమిన్"

గంభీరమైన గొంతు వినపడింది.

సుమతి లోపలికి అడుగు పెట్టింది. గదిలో రివాల్వింగ్ చైర్‌లో కూర్చుని పైపు పీలుస్తూ కూర్చున్నాడు ఆఫీసరు.

"రండి ... రండి"

సుమతిని చూస్తూ ముందుకు వంగి అన్నాడు.

సుమతి అతని ముందు వినయంగా నిలుచుని అతను చెప్పబోయే విషయం గురించి ఎదురు చూస్తుంది.

మొన్న అనంతపురం నుంచి ఒక పార్టీ వచ్చింది - గుర్తుందా?"

సుమతి తల వూపింది.

"వాళ్ళ కాంట్రాక్టులకు సంబంధించిన ఫైలు పూర్తి చేశారా?"

"లేదండి... రేపు మధ్యాహ్నానికల్లా పూర్తిచేసి మీకు సబ్‌మిట్ చేస్తాను."

"నో నో...అది ఈ వేళే నాకు కావాలి. మీరు ఇప్పుడు కూర్చుని ఫైలు పూర్తిచేసి ఇవ్వండి" అనేసి ముందున్న కాగితాల్లో తల దూర్చేశాడు.

సుమతి సందేహిస్తూ నిలబడింది.

"ఏమయినా సందేహాలున్నాయా?" అన్నాడు తల పైకెత్తి చూస్తూ.

సుమతి తల అడ్డంగా త్రిప్పింది.

"మీరు వెళ్ళి త్వరగా ఫైలు పూర్తిచేసి తీసుకురండి" అని మళ్ళీ కాగితాల్లో తల దూర్చేశాడు.

సుమతి వెళ్ళి సీటులో కూర్చుంది. సెక్షనులోని వారందరూ వెళ్ళిపోయారు. తనొక్కర్తే మిగిలింది. ట్రేలో పర్దిన ఫైళ్ళన్నీ మళ్ళీ తీసి విసుగ్గా టేబులుమీద పడేసింది

అసలు తనీవేళ త్వరగా యింటికి వెళ్ళాలని అనుకుంది. కాని పనివత్తిడివల్ల వెళ్ళలేక పోయింది. తమ్ముడికి జ్వరంగా ఉంది. మందు కొనుక్కొని వెళ్ళాలి. చంటి చెల్లికి పాలడబ్బా కూడా కొనాలి. తను ఆలస్యంగా యింటికి వెళ్ళినందుకు నాన్న తిడతాడు. ఎందుకాలస్యం అయిందని సవాలక్ష ప్రశ్నలు వేస్తాడు. వచ్చే సంవత్సరం నాన్న రిటైర్ అయిపోతాడు. తమ్ముడింకా బి. యస్సి. మొదటి సంవత్సరంలోనే ఉన్నాడు. వాడింకెప్పుడు ఉద్యోగానికి అందుకుంటాడు? తన

స్నేహితురాళ్ళంతా పెళ్ళిళ్ళు చేసుకుని హాయిగా కాపురాలు చేసుకుంటున్నారు. తను... తనుమాత్రం ఇలా.

నిస్పృహగా నిట్టూర్చి ఫైలుమీదకు దృష్టినిపోనిచ్చింది.

ఫైలు పదు గంటలకు పూర్తయింది. ఒకసారి తేలికగా ఊపిరిపీల్చుకుని నొసట పట్టిన చెమటను కొంగుతో అద్దుకుని ఫైలు తీసుకుని ఆఫీసరు గదికి బయలు దేరింది.

"రండి... రండి... ఫైలు పూర్తయిందా?" ఆఫీసరు సుమతిని ప్రశ్నించాడు. అతని మాటలు ముద్దగా ఉన్నాయి. మాట్లాడుతుంటే వాసన కూడా వేస్తోంది.

పూర్తయినట్టుగా అతని ప్రశ్నకు సమాధానం ఇచ్చి ఫైలు అతని ముందుంచింది సుమతి.

"కూర్చోండి" అన్నాడు ఫైలు చేతుల్లోకి తీసుకుంటూ.

సుమతి అలానే నిలుచుంది.

"పరవాలేదు...కూర్చోండి" ఈసారి గట్టిగా అన్నాడు.

సుమతి కూర్చుంది.

ఆఫీసరు ఫైలుమొత్తం పరీక్షించి తలెత్తి పైకిచూశాడు.

"వెరీగుడ్... మీకు చాలశ్రమ యిచ్చినట్టున్నాను... ఐ యామ్ వెరీసారీ...!

"అబ్బే... శ్రమేమి లేదండి."

"చాలా ఆలస్యం అయింది... మిమ్మల్ని నాకారులో డ్రాప్ చేస్తాను."

"అబ్బే... మీ కాశ్రమేం అక్కరలేదండి... మా యింటికి డైరెక్ట్‌గా సిటీబస్సుంది... బస్సుస్టాపు కూడా ఇక్కడికి దగ్గరే"

"మీకు పెళ్ళి కాలేదనుకుంటాను?"

ఆఫీసరు సుమతి ముఖంలోకి సూటిగాచూస్తూ అడిగారు.

అతని ప్రశ్న సుమతికి బాధ, కోపం కలిగించాయి. అయినా ఆవేమీ పైకి కనపడ నీయలేదు.

అతని ప్రశ్నకి అవునన్నట్లు తల ఊపింది.

"మీ పని నాకు చాల బాగా నచ్చింది...మీకు త్వరలోనే ప్రమోషన్ ఇవ్వాలని అనుకుంటున్నాను" అన్నాడునవ్వుతూ.

సుమతి నమ్మలేనట్లుగా అతని ముఖంలోకి చూసింది. ఆమె మనసు ఆనందంతో గంతులు వేసింది.

అతను కుర్చీలోంచి లేచి సుమతివైపు వచ్చాడు.

"మీకు ఆశ్చర్యంగా ఉందా? నిజంగానే మీకు ప్రమోషన్ ఇవ్వదలిచాను."

"చాల థాంక్సండి... మీ మేలు ఈజన్మలో మరచి పోలేనండి" అంది సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అవుతూ.

'కాని మీ వల్ల నాక్కావలసిన పనికూడా ఒకటుంది... అది అవుతే తప్పకుండా మీకు ప్రమోషన్ ఇస్తాను. ఎప్పుడో

ఏవిటి? రేపే మీకు ప్రమోషన్ ఇస్తాను' అన్నాడు మరింత సుమతి కుర్చీకి దగ్గరగా వస్తూ.

'నా వల్ల మీకు కావలసిన పనా!...ఏమిటండీ అది?...' నేను తప్పకుండా చేస్తాను' అంది దృఢమైన నిశ్చయంతో.

'వెరీ గుడ్... చలాకీతనం అంటే ఇలా ఉండాలి' అని అతను సుమతి కుర్చీ వెనకనుంచి ఆమె భుజాలమీద చేతులు వేసి ముందుకు వంగి చెక్కిలిమీద ముద్దు పెట్టుకోబోయాడు.

సుమతి చటుక్కున తప్పించుకుని లేచి దూరంగా జరిగి బెదురు చూపులతో అతనివైపు చూసింది.

'మీరు చేస్తున్న దేవిటి?' అంది వగరుస్తూ.

'నాకు నీనుంచి కావల్సింది మరేవిటను కున్నావ్?' అంటూ ముందుకు అడుగులు వేశాడు.

అతను గది తలుపువైపు ఉండడంచేత తప్పించుకోవడం సుమతికి కష్టం అయింది. ఆపీసరు సుమతి దగ్గరికి వచ్చి రెండు చేతులతోనూ ఆమెను పొదవి పట్టుకున్నాడు. సుమతి గింజు కుంది. అయినా లాభంలేక పోయింది. నైట్ వాచ్ మెన్‌ని పేరుతో గట్టిగా పిలిచింది.

'ష్... అనవసరంగా అరవకు... వాడు కాదుకదా... ఆ దేవుడు కూడా నిన్నిప్పుడు ఆపలేడు... నీభవిష్యత్తు పాడు చేసుకోకు... నువ్వంగీకరిస్తే ప్రమోషన్ ఇస్తాను... లేదా నీ ఉద్యోగమే పోతుంది...జాగ్రత్త' ఆమెను మరింత గట్టిగా తన శరీరానికి అదుముకున్నాడు.

'నన్ను వదులు... దుర్మార్గుడా... రాక్షసుడా... నేనలాంటిదాన్ని కాదు...నీ ప్రమోషనూ వద్దు-ఉద్యోగమూ వద్దు...నన్ను వదులు...వదులుతావా లేదా?...'

సుమతి అరుస్తుంది. ఆమె అరవడానికి వీలు లేకుండా తన పెదాలతో ఆమె పెదాలు కలిపేశాడు అతను.

ఆఖరి ప్రయత్నంగా సుమతి పెనుగులాడి ఓడిపోయింది.

గోడమీది బల్లొకటి అతి చాకచక్యంగా పురుగును పట్టుకుంది.

*    *    *    *

బావి దగ్గర మూగిన జనం ఇంకా వాళ్ళిద్దరి గురించి మాట్లాడుకుంటున్నారు.

"కనీసం వచ్చే జన్మలోనైనా వీళ్ళ ప్రేమ ఫలించాలని మనం ఆశిద్దాం" అంటున్నా రెవరో.

ఇంతలో పోలీసువ్యాను అంబులెన్స్‌తో సహా వచ్చి ఆగింది. అవి హత్యో ఆత్మహత్యో నిర్ణయించడం కోసం పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు.

నారాయణ, సుమతుల శవాలు అంబులెన్స్‌లోకి ఎక్కించారు. అంబులెన్స్ భారంగా కదిలింది.

30-10-75, ఆంధ్రజ్యోతి